సాక్షి పశ్చిమగోదావరి

శుక్రవారం : 19 : జూలై : 2024



శిక్షా సప్తాహ్

జాతీయ విద్యా విధానం ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 22 నుంచి పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. 8లో ▸



హెల్మెట్ తప్పనిసరి

ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ తప్పక ధరించాలని ఉమ్మడి జిల్లా **న్యాయసేవాధికార** సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి **శ్రీనివాసమూర్తి** అన్నారు. 8లో ▸



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

జంగారెడ్డిగూడెంకు చెందిన చిన్నారి శివనాగ్ రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపికయ్యాడు. వచ్చేనెలలో విజయనగరంలో పోటీలు జరగనున్నాయి. 8లో ▸

ఎడతెగని వాన

సాక్షి, భీమవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం ప్రభావంతో గురువారం జిల్లావ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. సుమారు 2 వేల ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. జిల్లావ్యాప్తంగా 41.6 మి.మీ సగటు వర్షం కురవగా అత్యధికంగా తాడేపల్లిగూడెంలో 95.8 మి.మీ వర్షపాతం నమోదైంది. వేకువ జామున మొదలై రాత్రి వరకు తెరిపివ్వకుండా వర్షం పడుతూనే ఉంది. తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం, భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో భారీగా, ఆచంట, తణుకు నియోజకవర్గాల్లో మోస్తరుగా వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. అధిక శాతం మంది ఇళ్లకే పరిమితం కాగా విద్యాసంస్థలు, కార్యాలయాలు, దుకాణాలకు వెళ్లేవారు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడ్డారు. జనం లేక మార్కెట్లు వెలవెలబోయాయి. భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు ఆర్టీసీ బస్టాండుల వద్ద మోకాలు లోతు నీటితో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల సమయానికి తాడేపల్లిగూడెంలో 95.8 మి.మీ అత్యధిక వర్షపాతం నమోదయ్యాయి.

చెరువుల్లా.. వరి చేలు : పల్లపు ప్రాంతాల్లోని పంట పొలాలు నీటమునిగాయి. జిల్లాలోని 2.3 లక్షల ఎకరాల్లో తొలకరి సాగు చేపట్టగా తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు రూరల్, గణపవరం మండలాల్లో నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పాలకొల్లు, పోడూరు, యలమంచిలి, వీరవాసరం మండలాల్లో పనులు జోరందుకుంటున్నాయి. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 38 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. కుండపోతతో తాడేపల్లిగూడెం, పెంటపాడు, ఆకివీడు, ఇరగవరం తదితర మండలాల్లోని 42 గ్రామాల పరిధిలోని 2 వేల ఎకరాల్లో పొలాలు నీట మునిగినట్టు వ్యవసాయశాఖ ప్రాథమికంగా గుర్తించింది. వర్షం తెరిపివ్వకుంటే మరిన్ని పొలాలు నీట మునిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంటున్నారు. రెండు, మూడు రోజుల క్రితం ఊడ్చిన పొలాల్లోని నాట్లు పైకి తేలిపోతుండటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. పొలాల్లోని ముంపు నీరు బయటకు పోయేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

అధికార యంత్రాంగం అప్రమత్తం

భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, గుడిసెలు, షెడ్లలో నివసిస్తున్న ప్రజలు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున శానిటేషన్, బ్లీచింగ్, శుద్ధి చేసిన తాగునీటి సరఫరాకు మున్సిపల్, ఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. డయేరియా, డెంగ్యూ టైఫాయిడ్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యశాఖ అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నీటిపారుదలకు ఆటంకాలు లేకుండా డ్రెయిన్లలో అడ్డంకులు తొలగించాలన్నారు. రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు కాలువ గట్లు, డ్రెయిన్లు, గోదావరి గట్లను పర్యవేక్షించాలని, గండ్లు పడే అవకాశం ఉంటే ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు.

831.2 మి.మీ వర్షపాతం

భీమవరం: జిల్లాలో భారీ వర్షాలకు 831.2 వర్షపాతం నమోదయ్యింది. గురువారం వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. మండలాల వారీగా తాడేపల్లిగూడెంలో అత్యధికంగా 95.8 మి.మీ వర్షం కురిసింది. పెనుమంట్రలో 30.2, పెనుగొండలో 32.4, ఆచంటలో 30, పోడూరులో 29.4, మొగల్తూరులో 34.6, నరసాపురంలో 54.6, పాలకొల్లులో 62.2 మి.మీ వర్షపాత నమోదైంది. యలమంచిలిలో 20.4, గణపవరంలో 31.6, ఆకివీడులో 33, ఉండిలో 48.2, పాలకోడేరులో 45.2, వీరవాసరంలో 31.4, భీమవరంలో 50.4, కాళ్లలో 25.2, పెంటపాడులో 71.6, తణుకులో 25.4, అత్తిలిలో 33.2, ఇరగవరంలో 46.4 మి.మీ వర్షం కురిసింది.

కుండపోత

- స్తంభించిన జనజీవనం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ముంపు బారిన 2,000 ఎకరాలు
- తొలకరి పనులకు ఆటంకం
- జిల్లాలో 41.6 మి.మీ సగటు వర్షపాతం



పెంటపాడు మండలంలో నీట మునిగిన వరి పొలాలు



మొగల్తూరు మండలం రామన్నపాలెం పంచాయతీ అడవిపర్రలో నారుమడుల్లో వర్షం నీరు



తాడేపల్లిగూడెం మండలం నందమూరులో అక్విడెక్ట్‌ను తాకుతూ ప్రవహిస్తున్న నీరు

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

భీమవరం(ప్రకాశం చౌక్): భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు. జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 08816 299219, స్టేట్ టోల్ ఫ్రీ నంబర్లు 1070, 1800-425-0101, 83339 05022ను ప్రజలు సమస్యలు తెలియజేయవచ్చు.

వర్షాలను సమర్థంగా ఎదుర్కొంటాం

జేసీ ప్రవీణ్ ఆదిత్య

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో భారీ వర్షాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నట్టు జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. వెలగపూడిలోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి జేసీ ప్రవీణ్ ఆదిత్య హాజరై జిల్లాలో ముందస్తు ఏర్పాట్లపై వివరించారు. జిల్లాలోని ఐదు మండలాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. భీమవరంలో యనమదుర్రు డ్రెయిన్ వద్ద ఇసుక బస్తాలు సిద్ధంగా ఉంచామన్నారు. లంక గ్రామాల్లో ప్రజల కోసం నిత్యావసర సరుకులు సిద్ధంగా ఉంచామని, వైద్య బృందాలు, బోట్స్ మెన్ సొసైటీలను అప్రమత్తం చేశామన్నారు. వశిష్ట గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేశామన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా ఆదేశాలు జారీ చేశామన్నారు. డీఆర్వో జె.ఉదయ భాస్కర్ రావు, డీఎంహెచ్ఓ డాక్టర్ డి.మహేశ్వరరావు, డీపీఓ విక్టర్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



తణుకులో నీటమునిగిన రోడ్డుపై రాకపోకలు



తాడేపల్లిగూడెంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై కూలిన చెట్టు



తాడేపల్లిగూడెంలో వర్షం నీటిలో అవస్థలు

న్యూస్‌రీల్

హెల్మెట్‌తో ప్రాణ రక్షణ



భీమవరంలో అవగాహన ర్యాలీ

భీమవరం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని భీమవరం మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి సత్యవతి మాట్లాడుతూ హెల్మెట్ వాడకంతో సురక్షితంగా గమ్యస్థానాలను చేరవచ్చన్నారు. హెల్మెట్ లేని ప్రయాణం చట్టరీత్యా నేరమన్నారు. వన్ కే వాక్‌లో భాగంగా జువ్వలపాలెం రోడ్డులో ఉన్న ఆదిత్య కాలేజీ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎం.సోమశేఖర్, న్యాయమూర్తులు బి.అప్పలస్వామి, జి.సురేష్ బాబు, డి.ధనరాజు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి ఎ.ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నేరం



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

భీమవరం(ప్రకాశం చౌక్): లింగా నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు హెచ్చరించారు. గురువారం భీమవరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయంలో సబ్ డిస్ట్రిక్, డిస్ట్రిక్ స్థాయి అప్రోప్రియేట్ అథారిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ నిషేధ చట్టం, నిబంధనలను స్కానింగ్ కేంద్రాలు తప్పక పాటించాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అలాగే లింగ నిర్ధారణ పరీక్షలపై కమిటీ సభ్యులు, అధికారులకు సూచనలు ఇచ్చారు. వైద్యారోగ్యశాఖ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ అదృశ్యంపై వీడని ఉత్కంఠ



నరసాపురం ఎంపీడీఓ కార్యాలయంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నరసాపురం రూరల్: నరసాపురం ఎంపీడీఓ మండవ వెంకట రమణరావు అదృశ్యం మిస్టరీ వీడలేదు. ఆయన అదృశ్యమై నాలుగు రోజులు గడిచినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబసభ్యులతో పాటు ఉద్యోగ వర్గాల్లో ఆందోళన మరింత పెరిగింది. ఎంపీడీఓ అదృశ్యం వ్యవహారం రాజకీయ రంగు పులుముకుని కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ నాయకులపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపీడీఓ అదృశ్యంపై స్వయాన ఉప ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేసినా ఎటువంటి పురోగతి లేదు. గురువారం ఈ కేసు విషయమై నరసాపురం మండల పరిషత్ కార్యాలయానికి డీఎస్పీ, ఎస్సై వచ్చి విచారించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ వీరభద్రరావు, సిబ్బందిని విచారించి పలు కోణాల్లో వివరాలు సేకరించారు.

శరీరంపై మచ్చలను అశ్రద్ధ చేయొద్దు



లెప్రసీ సర్వే రికార్డులను తనిఖీ చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: శరీరంపై స్పర్శలేని రాగి, రంగు మచ్చలను అశ్రద్ధ చేయవద్దని, వైద్యులను సంప్రదించాలని జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు సూచించారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో గురువారం లెప్రసీపై చేపట్టిన సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వచ్చేనెల 2 వరకు సర్వే జరుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ప్రసవాల లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు.

వేట నిషేధ భృతి వెంటనే ఇవ్వాలి

నరసాపురం రూరల్: వేట నిషేధ కాలానికి సంబంధించి మత్స్యకారులకు భృతిని వెంటనే విడుదల చేయాలని మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జెల్లి రామ్మోహనరావు డిమాండ్ చేశారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు రెండు నెలల కాలానికి రూ.20 వేలతో పాటు నిత్యావసర సరుకులను ఇచ్చి మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలన్నారు. గురువారం పెదమైనవానిలంక గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసాపురం మండలంలో మత్స్య సంపదపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. వీరంతా చేపల వేటే ఆధారంగా బతుకుతున్నారన్నారు. మత్స్యకారులను ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని, జీవనోపాధికి చర్యలు తీసుకోవడం లేదన్నారు. చేపల వేటపై ఆధారపడి ఎందరో జీవిస్తుంటే నష్టపరిహారం మాత్రం 1,098 కుటుంబాలకు మాత్రమే అందుతుందన్నారు. మత్స్యకారుల వలసలను నిరోధించాలని కోరారు. మత్స్యకారులు తిరుమాని రామారావు, కొక్కిరిగెడ్డ నాగ వెంకటేశ్వర్లు, పొన్న మండల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

తీర ప్రాంత ప్రణాళికకు సహకరించాలి

కలెక్టర్ నాగరాణి

నరసాపురం: కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ (సీజెడ్ఎంపీ) అమలుకు అందరూ సహకరించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సీజెడ్ఎంపీ అమలు కోసం ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తీరప్రాంతాల్లో మత్స్యకారులు, స్థానికులకు జీవనోపాధి భద్రత, తీరప్రాంతాల పర్యావరణాన్ని పరిరక్షించడం, తీర ప్రాంతాల్లో తరచూ జరిగే ప్రమాదాలు నివారణ, గ్లోబల్ వార్మింగ్, సముద్ర మట్టం పెరుగుదల నివారణ సీజెడ్ఎంపీ లక్ష్యాలన్నారు. డ్రాఫ్ట ప్లాన్‌ల తయారీ ప్రక్రియను ప్రభుత్వం పర్యావరణ, అటవీ శాఖలు, సైన్స్ అండ్ టెక్నాలజీ (చెన్నై)కు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ సస్టెయినబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్ ద్వారా రూపొందించామన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు నుంచి సేకరించిన అభిప్రాయాలను కేంద్రానికి నివేదిస్తామన్నారు. పేరుపాలెం బీచ్‌లో ప్రమాదాల నియంత్రణకు కూడా చర్యలు చేపడతామన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

బీచ్‌లో ప్రమాదాల నివారణకు..

నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ పేరుపాలెం బీచ్‌ను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయాలని, బీచ్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కాలుష్య నివారణకు ప్రజలు సహకరించాలన్నారు. సబ్ కలెక్టర్ ఎం.అచ్యుత్ అంబరీష్, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ వీరాస్వామినాయుడు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ కె.వెంకటేశ్వరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్‌వీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉధృతంగా కొండ వాగులు

జంగారెడ్డిగూడెం రూరల్: భారీ వర్షాలకు ఏలూరు జిల్లాలోని ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో వాగులు పొంగి పొర్లుతున్నాయి. కొంగువారిగూడెం శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయంలోకి వరద నీరు పోటెత్తుతోంది. గంటకు 10 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా జలాశయం గేట్లు ఎత్తి 2 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా ప్రస్తుతం 81.30 మీటర్లు ఉందని ఇరిగేషన్ ఏఈ భాస్కరరావు తెలిపారు. పట్టెన్నపాలెం వద్ద జల్లేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగు పొంగడంతో సుమారు 50 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లక్కవరంలో వర్షానికి బాకి అన్నవరం అనే వ్యక్తికి చెందిన ఇంటి గోడ కూలింది. ఇంట్లో ఎవరికీ ఏమీ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

జల్లేరు జలాశయంలోకి భారీగా..

బుట్టాయగూడెం: మండలంలోని జల్లేరు జలాశయం, పోగొండ రిజర్వాయర్, కోడే కాల్వల్లోకి వరదనీరు భారీగా వచ్చి చేరుతోంది. జల్లేరు జలాశయం పూర్తి సామర్థ్యం 217.80 మీటర్లు కాగా సాయంత్రానికి 215.00 మీటర్లకు నీరు చేరింది. అధికారులు జలాశయంలోని 2 గేట్లను ఎత్తి సుమారు 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 3,000 క్యూసెక్కులు ఉందని అధికారులు అంటున్నారు. పోగొండ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 157 మీటర్లు కాగా సామర్థ్యానికి మించి వరద నీరు ప్రవహిస్తోంది.



కంసాలికుంట వాగులో చిక్కుకున్న స్కూల్ బస్సును బయటకు తీసుకువస్తున్న స్థానికులు

కేంద్ర మంత్రిని కలసిన ఎస్పీ



కేంద్ర మంత్రి వర్మతో ఎస్పీ నయీం అస్మి

భీమవరం: కేంద్ర ఉక్కు, గనుల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను భీమవరంలోని ఆయన నివాసంలో గురువారం ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వర్మకు మొక్కను అందజేసి పలు అంశాలపై చర్చించారు.

కైకలూరు సర్పంచ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

కైకలూరు: నియోజకవర్గ ప్రధాన కేంద్రం కైకలూరు పంచాయతీ సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి పంచాయతీ నిధులను సొంత ఖాతాలో వేసుకున్నారని పలువురు వార్డు సభ్యులు కలెక్టర్ వెట్రి సెల్వికి గురువారం ఫిర్యాదు చేశారు. 15వ వార్డు సభ్యుడు కొటికలపూడి వెంకట నరసింహమూర్తి నాయుడు ఆధ్వర్యంలో వార్డు సభ్యులు ఏలూరులో కలెక్టర్‌ను కలిశారు. సర్పంచ్ మేరీ నవరత్నకుమారి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతా నంబరు 3600 2834475లో సుమారు రూ.1,84,04,944 పంచాయతీ నిధులు జమ అయినట్లు గుర్తించామన్నారు. దీనిపై పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా నూజివీడు పంచాయతీరాజ్ డివిజనల్ అధికారిని విచారణకు ఆదేశించారన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27న సొంత ఖాతాలో పంచాయతీ నగదు జమ చేయడం నిబంధనలకు విరుద్ధమని నివేదికను జిల్లా అధికారులకు అందించారన్నారు. నగదు విషయమై వార్డు సభ్యులు అడుగుతుంటే సర్పంచ్ సమాధానం చెప్పడం లేదని, నగదు రికవరీ చేసి పంచాయతీ ఖాతాలో జమచేయాలని కలెక్టర్‌ను కోరారు.



కలెక్టర్‌ను కలిసిన వార్డు సభ్యులు

22 నుంచి 'శిక్షా సప్తాహ్'

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఈనెల 22 నుంచి శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించాలని డీఈఓ ఎస్.అబ్రహం ఆదేశించారు. 22న ఉపాధ్యాయులు (టీఎల్ఎం) స్థానిక వనరులతో బోధన అభ్యసన సామాగ్రి తయారు చేసి ప్రదర్శించడం, 23న పునాది అభ్యసన, సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి, 24న క్రీడా దినోత్సవం, 25న సాంస్కృతిక దినోత్సవం, 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, 27న పర్యావరణ పరిరక్షణ సంకల్ప యాత్ర కృత్యాలు, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎంఈఓలు, హెచ్‌ఎంలు పర్యవేక్షించాలన్నారు.

క్లుప్తంగా

ఫ్లెక్సీ ధ్వంసం.. వైఎస్సార్ సీపీ నేతపై నెట్టే యత్నం



గంగవరంలో ధ్వంసం చేసిన ఫ్లెక్సీ

కొయ్యలగూడెం: గంగవరంలో కూటమి నేతల ఫ్లెక్సీని ధ్వంసం చేసిన ఘటనలో అదే గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేతను బాధ్యుడిని చేసేందుకు కుట్ర జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. గంగవరం గ్రామ ప్రవేశ రహదారి వద్ద కూటమి నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి ధ్వంసం చేశారు. దీనిపై కూటమి పార్టీల నేతలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ప్రాంతం వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్‌కు చెందినది కావడంతో అతని ప్రోద్బలమే ఫ్లెక్సీ ధ్వంసానికి కారణమని కొందరు ఆరోపించారు. అయితే క్షేత్రస్థాయి విచారణలో వైఎస్సార్సీపీ నేతకు కూటమికి చెందిన ఓ వ్యక్తికి గతంలో ఉన్న విభేదాల నేపథ్యంలో ఫ్లెక్సీని ధ్వంసం చేస్తే ఆ నెపం వైఎస్సార్‌సీపీ నేతపై పడుతుందనే ఉద్దేశంతో ఇలా వ్యవహరించినట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. ఫ్లెక్సీని ధ్వంసం చేసే సమయంలో అక్కడే ఉన్న వ్యక్తిని కూడా కూటమి వ్యక్తి బెదిరించినట్లు తెలిసింది. వివాద రహితుడిగా పేరున్న వైఎస్సార్ సీపీ నేతను ఇరుకునపెట్టేందుకు, పోలీస్ కేసులో ఇరికించే కుట్రతో కూటమి వ్యక్తులే ఇటువంటి దుశ్చర్యకు పాల్పడ్డారని ప్రజలు ఆక్షేపిస్తున్నారు. కూటమి ముఖ్య నేతలు వివాదాలకు పాల్పడే ఇటువంటి వ్యక్తుల విషయంలో ఆచితూచి వ్యవహరించాలని వారు కోరుతున్నారు.

వైఎస్ జగన్ దృష్టికి టీడీపీ దాడులు, దౌర్జన్యాలు



వైఎస్ జగన్‌కు సమస్య వివరిస్తున్న కామిరెడ్డి నాని

దెందులూరు : ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపై టీడీపీ శ్రేణులు చేసిన దాడులను, దౌర్జన్యాలను, ఆస్తి నష్టాన్ని వైఎస్సార్ సీపీ నేత కారుమూరి సునీల్ కుమార్, దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. నియోజకవర్గాల వారీగా జరిగిన సంఘటనలు, నష్టాలను బాధితుల వివరాలను నివేదిక రూపంలో అందించారు. గతంలో ఇలాంటి మారణకాండ జరగలేదని, ఆస్తుల ధ్వంసం లేదన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులకు, బాధిత కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని వైఎస్ జగన్ చెప్పారని కారుమూరి సునీల్ కుమార్, కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు.

నాపై హత్యాయత్నానికి ఒడిగట్టారు.. కామిరెడ్డి నాని

టీడీపీ శ్రేణులు తనపై హత్యాయత్నానికి ఒడిగట్టారని, తన ఇంటిని ధ్వంసం చేసి వాహనాలను దగ్ధం చేశారని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వివరించినట్లు వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షులు కామిరెడ్డి నాని గురువారం స్థానిక విలేకరులకు చెప్పారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని వైఎస్ జగన్ భరోసా ఇచ్చినట్లు నాని వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్

నిడమర్రు: కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)-2020 ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వార్షికోత్సవంలో భాగంగా ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ (విద్యా వారం) కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెట్టిన తర్వాత పరివర్తనాత్మక సంస్కరణలపై, దేశ వ్యాప్తంగా విద్యాభివృద్ధి చేయడంలో నిబద్ధతను తెలియజేసేదిశగా ఈ కార్యక్రమం లక్ష్యమని జిల్లా విద్యాశాఖ ప్రకటించింది. అప్పటివరకు ఉన్న 10+2+3 విద్యా విధానం బదులు డాక్టర్ కృష్ణస్వామి కసూర్తి రంగన్ సిఫార్సుల మేరకు నూతన జాతీయ విద్యా విధానం రూపకల్పన జరిగింది. ఈ ఎన్‌ఈపీ-2020లో 5+3+3+4 పాఠశాల విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానాన్ని 2020 జూలై 29న కేంద్రం ఆమోదించింది. దీంతో నూతన విద్యా విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లే లక్ష్యంతో కేంద్రం ఆదేశాల మేరకు ఈ శిక్షా సప్తాహ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు, స్థానికుల భాగస్వామ్యం కావాలని జిల్లా విద్యాశాఖ జారీ చేసిన మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

- జాతీయ విద్యా విధానం అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి
- ఈనెల 22 నుంచి 28 వరకు ప్రత్యేక వారోత్సవాలు
- మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర సమగ్ర శిక్ష శాఖ
- ప్రజల్లోకి తీసుకువెళ్లే లక్ష్యంతో విద్యాశాఖ కార్యాచరణ
- తల్లిదండ్రులు, స్థానికుల భాగస్వామ్యానికి కసరత్తు

వారం రోజుల కార్యక్రమాలు ఇలా..

- శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలతో వారం రోజుల పాటు నిర్వహించే ప్రణాళికను జిల్లా విద్యాశాఖ సిద్ధం చేసింది.
- **జూలై 22 - స్థానిక వనరులతో బోధన సామగ్రి ప్రదర్శన :** ఉపాధ్యాయులు స్థానికంగా లభించే వనరులతో తయారు చేసిన బోధనా అభ్యసన సామగ్రి తయారు చేసి ప్రదర్శించాల్సి ఉంటుంది. దీనికి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానిక పెద్దలను ఆహ్వానించాలి.



జల్లికొమ్మర స్కూల్లో టీఎల్‌ఎం ప్రదర్శన (ఫైల్)



జల్లికొమ్మర స్కూల్లో పేరెంట్స్ కమిటీ సమావేశం (ఫైల్)



జల్లికొమ్మర యూపీ స్కూల్

- **జూలై 23 - పునాది అభ్యసన కార్యక్రమం:** దీనిలో భాగంగా 1వ తరగతి నుంచి భాషపై పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం, గణితంలోని సంఖ్యా శాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా అమలు చెయ్యడానికి సమాజ భాగస్వామ్యులకు చర్చ ద్వారా అవగాహన కల్పించాల్సి ఉంది.
- **జూలై 24 - క్రీడా దినోత్సవం :** వివిధ క్రీడాంశాలపై పోటీలు నిర్వహించడం, శారీరక సౌష్టవం ప్రాముఖ్యతను తెలియజేసేలా ఈ పోటీలు ఉండాలి.
- **జూలై 25 - సాంస్కృతిక దినోత్సవం :** విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడానికి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు (ఫ్యాన్సీ డ్రెస్, పాటలు, నృత్య ప్రదర్శన, నాటికలు) నిర్వహించాలి.
- **జూలై 26 - సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం:** స్కిల్, డిజిటల్ ఇనిషియేటివ్ డే లో భాగంగా ప్రస్తుత ఉద్యోగావకాశాల నేపథ్యంలో అన్ని తరగతి గది అనుభవాలను మెరుగుపరచడానికి డిజిటల్ కార్యక్రమాలకు అవసరమయ్యే నూతన నైపుణ్యాల అవసరాన్ని గుర్తించడం. విద్యలో సాంకేతిక అభివృద్ధిని గుర్తించేలా చర్చించడం.
- **జూలై 27 - పర్యావరణ పరిరక్షణ దినోత్సవం :** పర్యావరణ పరిరక్షణ సంకల్ప యాత్ర కృత్యాలు (మిషన్ లైఫ్ ఆక్టివిటీస్) పాఠశాలలో పోషణ దినోత్సవం నిర్వహణ (న్యూట్రిషన్ డే) పాఠశాలల్లో కొత్త ఎకో క్లబ్‌ల ఏర్పాటు, విద్యార్థులు, తల్లులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి అమ్మ పేరుతో అమ్మతో కలిసి మొక్కలు నాటి అమ్మకి అంకితం కార్యక్రమం. దీనిలో భాగంగా ప్రతి ప్రభుత్వ బడిలో కనీసం 35 మొక్కలు తల్లి, బిడ్డలతో కలసి నాటించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి.
- **జూలై 28 - సామాజిక భాగస్వామ్య దినోత్సవం :** విద్యార్థుల సామాజిక భావోద్వేగ శ్రేయస్సు కోసం ప్రజలు, తల్లిదండ్రుల కమిటీలు, ఉపాధ్యాయ సంఘాల సహకారాన్ని పెంపొందించడం, నైపుణ్యాభివృద్ధికి పర్యావరణ వ్యవస్థను అందించడం.. అంటే పుట్టిన రోజులు, ప్రత్యేక సందర్భాల్లో తిథి భోజనాలు, విద్యార్థులతో పెద్దలు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనం చేయడం.

మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలి



రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి పాఠశాలల్లో తప్పనిసరిగా నిర్వహించాలి. సంబంధిత ఫొటోలతో కూడిన డాక్యుమెంటేషన్ నమోదు చెయ్యాలి. ఈ కార్యక్రమ నిర్వహణ, అమలు పరిచే విధి విధానాలకు జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, సమగ్ర శిక్షా సెక్టోరియల్ ఆఫీసర్స్, మండల విద్యాశాఖ అధికారులు బాధ్యులుగా ఉండి ఈ శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రతీ ఒక్కరూ కృషి చెయ్యాలి.

– ఎస్ అబ్రహం, డీఈవో, ఏలూరు

బైక్‌పై ప్రయాణంలో హెల్మెట్ తప్పనిసరి

- ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి
- హెల్మెట్ ధారణపై ఏలూరులో అవగాహన ర్యాలీ



ఏలూరులో ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు

ఏలూరు (టూటౌన్) : ద్విచక్రవాహన చోదకులతో పాటు వాహనం వెనుక కూర్చున్న వారు సైతం హెల్మెట్ ధరించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో 'హెల్మెట్ ధారణ-ప్రమాదాల నివారణ' అనే అంశంపై గురువారం ఏలూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహన చోదకులతో పాటు వాహనం వెనుక కూర్చుని ప్రయాణిస్తున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని చెప్పారు. చిన్న చిన్న ప్రమాదాల వల్ల తలకు గాయమైనప్పుడు పెద్ద మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రయాణించాలని సూచించారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బుల్లికృష్ణ మాట్లాడుతూ చట్టాలపై ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి ఇటువంటి కార్యక్రమాలు జిల్లా న్యాయసేవాధికార సంస్థ నిర్వహిస్తోందన్నారు. ప్రజలు చట్టాలపై అవగాహన మెరుగుపరుచుకోవాలని కోరారు. ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్బినేని విజయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలన్నారు. డీఎల్ఎస్ఏ నిర్వహించే కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని ఆయన తెలియజేశారు. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ పోలీసులు ప్రజల రక్షణార్థమే తనిఖీలు నిర్వహిస్తారని, ప్రజలు వాటిని ఇబ్బందికరంగా భావించరాదన్నారు. వాహనచోదకులు హెల్మెట్ ధరించి ప్రయాణించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ యూనివర్సల్ జడ్జి ఎస్.వాసుదేవ్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.రఘునాథ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వలంటీర్లు, ఎస్‌వీఆర్‌కే డిగ్రీ కాలేజ్ విద్యార్థులు, ట్రాఫిక్ సీఐ వెంకట సత్యసాయి, ఎన్జీవో రాజారావు, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పీడీ ప్రసాద్, ప్యానల్ లాయర్లు పి.వెంకటేశ్వరరావు, జీవీ భాస్కర్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో హత్యలు, అఘాయిత్యాలు పెరిగాయి

వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వినిస్టన్‌బాబు



పాలకొల్లు అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై హత్యలు, మహిళలపై అఘాయిత్యాలు నిత్యకృత్యంగా మారాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పల్నాడు జిల్లా వినుకొండలో వైఎస్సార్ సీపీ కార్యకర్త రషీద్‌ను టీడీపీకి చెందిన జిలానీ కత్తితో నరికి హత్య చేయడం శాంతిభద్రతలు అదుపు తప్పాయనడానికి నిదర్శనమన్నారు. దీనికి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనిత బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. తనను చంపవద్దని రెండు చేతులు జోడించి వేడుకున్నా రషీద్‌ను పట్టపగలు బహిరంగంగా కత్తితో నరికి చంపిన టీడీపీ గూండా జిలానీని కఠినంగా శిక్షించాలన్నారు. ఎన్ని కేసులుంటే అంత పెద్దగా నామినేటెడ్ పదవులిస్తామని యువగళం యాత్రలో నారా లోకేష్ బహిరంగంగా ప్రకటనలు చేసి పరోక్షంగా రెచ్చగొట్టడం వల్లనే టీడీపీ నేతలు దారుణాలకు ఒడిగడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న హత్యలపై హైకోర్టు స్పందించాలని, అనుమానితులపై నిఘా పెట్టి బైండోవర్ చేయాలని వినిస్టన్‌బాబు డిమాండ్ చేశారు.

ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడి హేయమైన చర్య

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీఆర్ చౌదరి



జంగారెడ్డిగూడెం: రాజ్యాంగాన్ని అవమాన పరిచేలా టీడీపీ వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీఆర్ చౌదరి అన్నారు. జంగారెడ్డిగూడెంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ప్రజల మద్దతుతో, రాజ్యాంగ బద్ధంగా రాజంపేట ఎంపీగా ఎన్నికైన మిథున్‌రెడ్డిపై టీడీపీ మూకలు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఈ దాడిని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యంలో గెలిచినా తన నియోజకవర్గానికి వెళ్లే పరిస్థితి లేకుండా టీడీపీ రాక్షసంగా వ్యవహరిస్తోందన్నారు. నెల రోజుల పాలనలో ప్రజల కోసం చేసింది వేళ్లతో లెక్కించేలా ఉంటే, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అవమాన పరిచేలా టీడీపీ చేస్తున్న పనులు వందల్లో ఉన్నాయన్నారు. దాడులు, హత్యలు ప్రస్తుతం రాష్ట్రంలో ఇవే కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. టీడీపీ నేతల దాడిలో గాయపడిన వారిని పరామర్శించేందుకు పుంగనూరులోని మాజీ ఎంపీ రెడ్డప్ప నివాసానికి వెళ్లిన మిథున్‌రెడ్డిపై టీడీపీ మూకలు రాళ్లదాడికి పాల్పడ్డారన్నారు. ఎంపీ వాహనంపై దాడి చేయడంతో వాహనం ధ్వంసం అయ్యిందన్నారు. టీడీపీ ఆటవిక పాలనకు ప్రజలు సైతం బిత్తరపోతున్నారన్నారు. టీడీపీ గూండాలు విచక్షణా రహితంగా దాడులు నిర్వహిస్తుంటే అడ్డుకోవాల్సిన పోలీసులు సైతం మిన్నకుండిపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలి పెట్టన్నారు. పోలీసులు ప్రజలకు జవాబుదారీ కాని, టీడీపీకి కాదని ఎద్దేవా చేశారు. గతంలో ఎన్నడూ లేని రాక్షస సంస్కృతికి టీడీపీ ఆజ్యం పోసిందని, జనం కోసం అంటూ గెలుపొందిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సైతం ఈ దాడులను ఖండించకపోవడం దురదృష్టకరం అన్నారు. అధికారం చేపట్టిన నాటి నుంచి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ దాడులు చేస్తున్న టీడీపీ తన వైఖరిని మార్చుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

వ్యాపారి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం: భీమవరం వన్‌టౌన్‌కు చెందిన బియ్యం వ్యాపారి బుధవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు ఏఎస్సై దేవరాజు చెప్పారు. గురువారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బియ్యం వ్యాపారి జి.నారాయణ బకాయిలు వసూలు చేసుకువస్తానని బుధవారం ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, ఆచూకీ లేని వ్యక్తికి చెందిన ద్విచక్రవాహనం, పాదరక్షలు భీమవరం మండలంలోని నాగిడిపాలెం వంతెన వద్ద ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆచూకీ కోసం గాలిస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

భార్య, మరో మహిళకు గాయాలు

ఏలూరు టౌన్ : ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొన్న ప్రమాదంలో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దెందులూరు మండలం కొమరేపల్లికి చెందిన బండి మనోహర్ (35), భార్య వేలంగిణి ఈనెల 17న ఏలూరు సర్వజన ఆసుపత్రిలో బంధువుల కుమార్తె ప్రసవించడంతో చూసేందుకు మోటారుసైకిల్‌పై వచ్చారు. అదే రోజు రాత్రి తంగెళ్లమూడిలో బంధువుల ఇంటి వద్ద ఉన్నారు. గురువారం భార్యాభర్తలు, బంధువుల అమ్మాయితోకలిసి బైక్ పై ఆసుపత్రికి బయలుదేరారు. తంగెళ్లమూడి కూడలి వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటో మోటారుసైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు కాగా, మరో మహిళకు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు సర్వజన ఆసుపత్రికి తరలించారు. మనోహర్ పరిస్థితి విషమంగా ఉండటంతో అతనిని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

21న భీమవరంలో చెస్ పోటీలు



చెస్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి వర్మ తదితరులు

భీమవరం: చదరంగం వల్ల పిల్లల్లో మేధస్సు పెరుగుతుందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఈ నెల 21వ తేదీన ఇంటర్నేషనల్ చెస్ డే సందర్భంగా భీమవరంలోని ఏఆర్‌ఆర్ రెసిడెన్సీలో నిర్వహించనున్న జిల్లా ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ బ్రోచర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ ర్యాంకింగ్ పోటీల్లో విజేతలు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే ప్రతి విద్యార్థికి ఇంటర్నేషనల్ చెస్ కిట్ ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల వారు 90632 24466 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అల్లూరి శివరామరాజు, తోట హరిబాబు, మైలాపురి మురళీ తదితరులు పాల్గొన్నారు.

చెస్ రాష్ట్ర పోటీలకు శివనాగ్ ఎంపిక



జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంకు చెందిన చిన్నారి పి.శివనాగ్ రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎన్నికైనట్లు కోచ్, దివ్యాస్ మాస్టర్ చెస్ అకాడమీ డైరెక్టర్ ఎ.సరళ మాధవి గురువారం చెప్పారు. బుధవారం ఏలూరులో జరిగిన జిల్లాస్థాయి చెస్ చాంపియన్‌షిప్ పోటీలలో శివనాగ్ అండర్-7 బాలుర విభాగంలో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ విజయంతో ఆగస్టు 3, 4 తేదీలలో విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారి పి.శివనాగ్‌ను ఎ.సరళమాధవి, రోటరీ సభ్యులు ఎ.చంద్రశేఖర్, జవ్వాజి ఉమా వెంకటేష్, తల్లిదండ్రులు, పలువురు ప్రముఖులు అభినందించారు.

క్లుప్తంగా

టాలెంట్ టెస్ట్‌కు 400 మంది హాజరు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆత్మబంధువులు సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక మాగంటి కల్యాణ మండపంలో గురువారం భారత్ శివ శక్తి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్ సంబంధించి 400మంది విద్యార్థులు ఈ టాలెంట్ టెస్టులో పాల్గొన్నారు. విజేతలకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌చే బహుమతి ప్రధానం చేశారు. ఎస్‌వీఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొలనువాడ పెద్ద కృష్ణంరాజు, కడియాల పరశురామయ్య, ఆత్మబంధవుల సేవా సంఘం అధ్యక్షులు వెజ్జు దుర్గా ప్రసాద్, ఫౌండర్ అండ సెక్రటరీ ఉషా కిరణ్, బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు, ఈతకోట తాతాజీ, కమిషనర్ మురళీకృష్ణలు పాల్గొన్నారు.

ఫిషర్‌మ్యాన్ సొసైటీ అధ్యక్షుడిగా నగేష్


నగేష్‌ను అభినందిస్తున్న నాయకులు

పెంటపాడు: ఫిషర్‌మ్యాన్ పెంటపాడు మండల శాఖ అధ్యక్షుడిగా కొండేపాడుకు చెందిన వడ్డీల సంఘ నాయకులు ముత్యాల నగేష్ ఎన్నికయ్యారు. బుధవారం రాత్రి మీనవిల్లూరు రామాలయం వద్ద ఆ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ సంఘ ఐక్యతకు, సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సంఘ కార్యదర్శిగా బోడపాడుకు చెందిన పట్టపు నాగబాబు, సహాయ కార్యదర్శిగా మీనవిల్లూరుకు చెందిన కోమర్తి పోశయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నగేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ మాజీ అధ్యక్షుడు రాజా బాలాజీ, నాయకులు విఘ్నేశ్వరరావు, బోడపాడు, మీనవిల్లూరు, కొండేపాడు గ్రామాలకు చెందిన సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి


భీమవరం: తమవైపు చూసి సిగరెట్టు ఎందుకు తాగుతున్నావని ముగ్గురు యువకులు కలిసి మరో యువకుడిపై దాడి చేసిన సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భీమవరం టూటౌన్‌లోని డాక్టర్ బీవీరాజు మార్గ్‌లో రహదారి పక్కన హేమంత్ అనే యువకుడు ద్విచక్రవాహనం ఆపి సిగరెట్ కాల్చుకుంటున్నాడు. అతనికి కొద్ది దూరంలో మరో ముగ్గురు సిగరెట్లు కాల్చుకుంటుండగా, మావైపు చూస్తు సిగరెట్టు ఎందుకు కాలుస్తున్నావంటూ హేమంత్‌పై దాడి చేశారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు.

పాఠశాలలకు నాడు-నేడు నిధులను విడుదల చేయాలి


డీఆర్‌వో ఉదయ భాస్కర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట గంగరాజు

భీమవరం అర్బన్: మండలంలోని తుందుర్రు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణానికి మంజూరైన నాడు-నేడు నిధులలో కొంత దారి మళ్లాయని వాటిని వెంటనే విడుదల చేసి పాఠశాల అభివృద్ధి కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె ఉదయ్ భాస్కర్‌కు కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోట గంగరాజు విజ్ఞప్తి చేశారు. భీమవరంలో ఆయన డీఆర్‌ఓ ఉదయ్ భాస్కర్‌కు గురువారం దారిమళ్లిన నిధులు విడుదల చేసి పాఠశాలలో అదనపు గదులు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరసవతి మణికంఠ ఉన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన తప్పనిసరి


సదస్సులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నిర్మల

ఉండి: మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన కార్యక్రమాలు, చట్టాలపై మహిళలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ యండగండి ప్రాజెక్టు సూపర్‌వైజర్ వి.నిర్మల్ అన్నారు. ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్టు సీడీపీవో ఆదేశాల మేరకు పీఎం మిషన్ శక్తి కార్యక్రమాన్ని గురువారం యండంగండి సెక్టార్‌లోని యండగండి 1 అంగన్‌వాడీ కేంద్రం నందు మహిళలకు పలు కార్యక్రమాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. వీటిలో ముఖ్యంగా సఖీ స్టాఫ్ సెంటర్, ఈవ్ టీజింగ్, గృహ హింస, వరకట్న వేధింపుల సమస్యలు, చట్టాలపై వివరించారు. అలాగే బేటీ బచావో, బేటీ పడావో, పీసీపీఎన్‌డీటీ బాల్య వివాహాలు, బాలల హక్కులు వంటి వాటిపై అవగాహన కల్పించారు. అలాగే ఉమెన్ హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించడంపైనా వారికి అవగాహన కల్పించారు. అనంతరం పూర్వ ప్రాథమిక విద్య యొక్క ఆవశ్యకత గురించి వివరించారు.

ఎడతెరిపి లేని వర్షం


వాణిబ్యాంకు రోడ్డులో పొంగుతున్న డ్రెయినేజీలు

- చెరువులను తలపిస్తున్న రోడ్లు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- పడిన విద్యుత్ స్తంభాలు

తణుకు: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. గురువారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షం కారణంగా తణుకులోని ఎడతెరిపి లేని వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు, పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ముఖ్యంగా రాష్ట్రపతిరోడ్డులోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగి ప్రవహిస్తుండటంతో ప్రధాన రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ప్రధానంగా బ్యాంకు కాలనీ, ఎన్జీవో కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఇరగవరం కాలనీల్లో రోడ్లపై వర్షపు నీరు చేరుకుంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు విద్యార్థులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని విద్యాసంస్థలు మధ్యాహ్నం నుంచి సెలవు ప్రకటించాయి. మరో రెండ్రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

వర్షానికి నీట మునిగిన రహదారులు

తణుకు అర్బన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి తణుకు పట్టణంలోని పలు ప్రాంతాలు నీటమునిగాయి. బుధవారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి తణుకు పట్టణ పరిధిలోని పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలబడిపోయింది. అంతే కాకుండా రహదారుల్లో సైతం వర్షపునీరు, మురుగునీరు ఏకమై వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంతో పాటు ముఖద్వారం, ఆవరణలోని డీవైఈవో కార్యాలయ ప్రాంతంలో వర్షపునీరు చుట్టేసింది. రాష్ట్రపతి రోడ్డులో సైతం రోడ్డు మార్జిన్‌లో వర్షపునీరు నిలబడిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. చిరువ్యాపారులు వర్షం ధాటికి వ్యాపారాలు మూసుకోగా మార్కెట్ అంతా మందకొడిగా వ్యాపారం సాగింది.

గూడెం ముద్దయ్యింది

తాడేపల్లిగూడెం: అల్పపీడన ప్రభావంతో నియోజకవర్గంలో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానతో గూడెం తడిసిముద్దయ్యింది. ఒక్క సారిగా వాతావరణం మారిపోయింది. ఉదయం ఆరు దాటిన దగ్గర నుంచి చిరుజల్లులతో ప్రారంభమైన వాన తర్వాత జోరందుకుంది. దీంతో పట్టణంలోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాలలో పొలాల్లోకి నీరు చేరింది. పట్టణంలో 17,19, 31,32 వార్డుల్లో విపరీతంగా వాననీరు చేరింది. వానకు కొన్ని ప్రాంతాలలో విద్యుత్‌స్థంభాలు పడిపోయాయి. విద్యుత్ సరఫరాకు తాత్కాలికంగా అంతరాయం కలిగింది. విద్యుత్ అధికారులు వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టారు. వర్షం పరిస్థితిపై ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు మునిసిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఒక్కొక్క వార్డుకు ఒక్కొక్క ఇన్‌చార్జిని నియమించి వానలవల్ల ప్రజలకు కలిగే అసౌకర్యాన్ని తొలగించాలని కోరారు. మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణ శానిటరీ సిబ్బందిని వార్డులకు పంపించి వాననీటి మళ్లింపు చర్యలను పర్యవేక్షించారు.

పట్టణంలో భారీ వర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా పట్టణంలో ఈదురు గాలులతో కూడిన ఎడతెరిపి లేని వర్షం పడింది. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం రోజంతా వర్షం పడుతూనే ఉంది. జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. వన్ టౌన్, టూ టౌన్ పురపాలక సంఘం పరిధిలో అన్ని ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. వాహనదారులు పలు ఇక్కట్లుకు గురయ్యారు.


తణుకు రాష్ట్రపతి రోడ్డులో వర్షానికి ఒకే గొడుగులో వెళ్తున్న బాలలు


తణుకు: డిగ్రీ కళాశాల వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు


వర్షపు నీటిలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణం


మునిసిపల్ అధికారులతో సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహించొద్దు


పారిశుద్ధ్యంపై సిబ్బందికి సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ విజయసారథి

పాలకొల్లు సెంట్రల్: వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది కాబట్టి పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని మున్సిపల్ కమిషనర్ విజయసారథి శానిటరీ అధికారులకు పలు సూచనలు చేశారు. గురువారం శానిటరీ, ఇంజనీరింగ్, సచివాలయ సెక్రటరీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ విజయసారథి మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే పట్టణంలో బస్టాండ్ సెంటర్ మోకాలు లోతులో నీరు ఉండేదన్నారు. ఇటీవల బస్టాండ్ సెంటర్, బెజవాడ కోడు, లజపతిరాయ్‌పేట ప్రాంతాల్లో డ్రెయినేజీలో సిల్ట్ తొలగించామన్నారు. ప్రస్తుతం పట్టణంలో వర్షం నీరు నిల్వ ఉండే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో డీఈ రాజ్‌కుమార్, ఏఈలు సాంబశివుడు, సతీష్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

చెరువులను తలపించిన వరి చేలు

తాడేపల్లిగూడెం రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తాడేపల్లిగూడెం మండలంలోని వరి చేలు చెరువులను తలపించాయి. గురువారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో మోదుగ గుంట, అప్పారావుపేట, ఎల్.అగ్రహారం, జగన్నాథపురం, మెట్ట ఉప్పరగూడెం, నవాబుపాలెం, దండగర్ర, చినతాడేపల్లి, కుంచనపల్లి తదితర గ్రామాల్లోని వరి చేలు నీట మునిగాయి. ఇప్పటికే రెండు దఫాలుగా కురిసిన భారీ వర్షాలకు వరి చేలు నీట మునిగి తేరుకుంటున్న తరుణంలో మరోసారి వరుణుడు రైతులపై కన్నెర్ర చేశాడు. ఈ నేపథ్యంలో రైతులు లబోదిబోమంటున్నారు. వర్షపు నీటిలో నాట్లు మునిగితే కుళ్లిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరలా నారు దొరికే పరిస్థితి లేదని వాపోతున్నారు. కాగా, జంగారెడ్డిగూడెంలోని ఎర్ర కాలువ జలాశయం నుంచి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ నీరు శుక్రవారం నాటికి తాడేపల్లిగూడెం మండలానికి చేరుకునే అవకాశం ఉంది. దీంతో మండలంలోని బంగారుగూడెం, పట్టింపాలెం, అప్పారావుపేట, మాధవరం, జగన్నాథపురం, మారంపల్లి, నందమూరు గ్రామాల రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే, తాడేపల్లిగూడెం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం - మసీదు సెంటర్ రహదారితో పాటు అంతర్గత రహదారుల్లోకి సైతం వర్షపు నీరుచేరింది. దీంతో ఆయా రహదారులు చెరువులను తలపించాయి. ఈ రహదారిలో పలు విద్యాసంస్థలు ఉండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనేక అవస్థలు ఎదుర్కొన్నారు. మరో 48 గంటల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో రూరల్ మండలంలోని రైతాంగం, పట్టణంలోని లోతట్టు ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎడతెరిపిలేని వర్షం- రైతులు బెంబేలు

పెంటపాడు: వాయుగుండం ప్రభావం వల్ల ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం వల్ల రైతులు బెంబేలెత్తారు. గత వారం రోజులు నుంచి నాట్లు తీవ్ర దశకు చేరుకొన్నాయి. ఈ సమయంలో ఒక్కరోజు పాటు కురిసన అకాల వర్షం రైతుల పాలిట శాపంలా మారింది. దీంతో పలు గ్రామాల్లో వరినాట్లు దెబ్బతిన్నాయి. ప్రధానంగా మీనవిల్లూరు, కొండేపాడు, కె. పెంటపాడు, యానాలపల్లి, రావిపాడు, అలంపురం, విప్పర్రు గ్రామాల్లో వరిచేలు నీట మునిగాయి. మరో రెండు రోజులు వర్షం ఇలానే తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.


మోదుగ గుంట గ్రామంలో వర్షపు నీటిలో వరి చేలు


మీనవిల్లూరు- కొండేపాడు ఆయకట్టులో చేనులో చేరిన వర్షపు నీరు

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

భీమవరం: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని డాక్టర్ వి.యస్. శిల్ప, డాక్టర్ జె. ఎస్. కుమార్ తెలిపారు. కె.జి.ఆర్.ఎల్ ఫార్మసీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాయామం, సరైన పౌష్టికాహారం వలన ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. మహిళలో రుతుక్రమ సమస్యల వల్ల కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం విద్యార్థులకు, కళాశాల సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కె.జి.ఆర్.ఎల్ ఫార్మసీ డైరెక్టర్ కె. నాగేశ్వరరావు, డి. రాఘవ, వైస్ ప్రిన్సిపాల్ కె . నిర్మల, అడపా లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



కెజిఆర్ఎల్ కళాశాలలో ఆరోగ్య అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ శిల్ప

హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి

తణుకు అర్బన్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణాలు చేయాలని తణుకు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కృష్ణ సత్యలత, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏవీ నాగరాజు అన్నారు. హెల్మెట్ ధరించండి ప్రాణాలు కాపాడుకోండి అనే నినాదంతో గురువారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తణుకు మునిసిపల్ కార్యాలయ ప్రాంతంలో హెల్మెట్ ధరించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో తలకు తీవ్రగాయాలై అధిక సంఖ్యలో మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్మెట్ ధరించడపోవడంతో ప్రమాదాల్లో కుటుంబ పెద్ద చనిపోయి ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితులు తలెత్తుతున్నాయని అన్నారు. వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరిస్తే ప్రాణాపాయం ఉండదని స్పష్టం చేశారు. కారు డ్రైవింగ్‌లో సైతం సీటు బెల్ట్ వేసుకోవాలని ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండి వాహనాలను నడపాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనానికి ఇన్సూరెన్స్ కూడా తప్పనిసరిగా కలిగి ఉండాలని అన్నారు. అనంతరం హెల్మెట్స్ ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తణుకు పట్టణ సీఐ ఎం.నాగరాజు, రూరల్ సీఐ జీవీవీఎస్ నాగేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్ఐ జానా సతీష్, న్యాయవాదులు కె.వెంకటేశ్వర్లు, అజయ్‌కుమార్, కోర్టు లైజెన్ ఎస్.కృష్ణమూర్తి, కోర్టు సూపరింటెండెంట్‌లు, ఉద్యోగులు, ట్రాఫిక్ పోలీసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.


తణుకులో హెల్మెట్‌ధారణపై అవగాహన కార్యక్రమంలో న్యాయమూర్తులు, సీఐలు

రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అరికట్టాలి

యలమంచిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి బదులుగా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుందని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ జేసీఎస్ బూత్ ఇన్‌చార్జి ఉచ్చుల స్టాలిన్ విమర్శించారు. కొత్త ప్రభుత్వంలో 31 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు హత్యకు గురవ్వగా, మరో 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. మూడు వేల మందిపై దాడులు జరిగాయన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు.

మహిళల సమగ్రాభివృద్ధికి మిషన్ శక్తి

తాడేపల్లిగూడెం రూరల్: మహిళల సమగ్రాభివృద్ధికి మిషన్ శక్తి తోడ్పాటునందిస్తుందని మారంపల్లి సర్పంచ్ సరిపల్లి పద్మావతి అన్నారు. గురువారం మండలంలోని మారంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ శక్తిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పద్మావతి మాట్లాడుతూ బాలికలను చదివించాలని, 18 ఏళ్ల లోపు వివాహాలు చేయవద్దని సూచించారు. బాల్య వివాహాలు చేయడం వల్ల శారీరక ఇబ్బందులను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి లింగ నిర్ధారణ, బాల్య వివాహాలు నిషేధం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు టి.అన్నపూర్ణ, కే.బంగారం, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలోనూ తల్లులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే వరునికి ఏడేళ్ల జైలు, లక్ష రూపాయలు జరిమానా విధిస్తారని హెచ్చరించారు. వైద్యాధికారిణి రూపాదేవి, జీఎంఎస్‌కే వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు కే.రామలక్ష్మి, బి.వెంకటలక్ష్మి, కే.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.


మారంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన అవగాహన కార్యక్రమం దృశ్యం


తిరుపతిపురంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ తణుకు ప్రాజెక్టు అధికారి ప్రమోదకుమారి

మహిళలను వేధిస్తే కఠినచర్యలు

అత్తిలి: పని ప్రదేశాల్లో మహిళలపై వేధింపులకు పాల్పడితే సంబంధిత బాధ్యులపై చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ తణుకు ప్రాజెక్టు అధికారి బి.ప్రమోదకుమారి అన్నారు. అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామంలోని ఏవీఆర్ మెరైన్స్‌లో మిషన్ శక్తి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చట్టపరంగా మహిళలకు ఉన్న చట్టాలను వివరిస్తూ మహిళలను వేధించిన వారిపై లైంగిక వేధింపుల చట్టం కింద చర్యలు ఉంటాయని అన్నారు. ఇందులో భాగంగా మహిళలకు అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకురాలు ఎం.శ్రీదేవి, మహిళా సంరక్షక కార్యదర్శి రాగసుధ, అంగన్‌వాడీ కార్యకర్త పార్వతి, లలితకుమారి, చంద్రిక, మాధవి తదితరులు పాల్గొన్నారు.

35 మందికి ఉచిత రక్త పరీక్షలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 35మందికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. గురువారం తణుకు బ్యాంక్ కాలనీలో గల కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ మోగంటి రాజేశ్ పరీక్షలను నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. ఈ శిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పెనుమర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం


సేవా కార్యక్రమంలో మానవత సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రామచంద్రరావుపేటలోని పేద కుటుంబానికి ఒక బస్తా బియ్యం, కిరాణా సరుకులు అందజేశారు. రూ.2 వేలు ఆసుపత్రి ఖర్చులు అందజేశారు. మానవతా అధ్యక్షుడు పచ్చ వెంకటేశ్వరరావు, సెక్రటరీ యర్రా ఆంజనేయ స్వామి, కోశాధికారి యెగ్గిన శరత్ బాబు, కురుమల వెంకటాచలం, శ్రీనివాసరాజు, బురిడీ సతీష్, చేకూరి బంగ్గారాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలని వినతి


తణుకులో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తణుకు: ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల పి.ఎఫ్ ఖాతాల్లో సొమ్ము జమ చేయకుండా కార్మికులకు ద్రోహం చేస్తున్న ×ఫస్ట్ ఆబ్జెక్ట్ ప్రైవేటు లిమిటెడ్‌ కాంట్రాక్టు ఏజన్సీని బ్లాక్ లిస్టులో పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. గురువారం మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ మెడికల్ కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ కార్యదర్శి డి.పుష్పలత, మార్లపూడి వెంకటలక్ష్మి, పి.విజయలక్ష్మి, పి.రేణుక, వై.రత్నం, ఎం.బేబి, ఎస్.లక్ష్మి, డి.చిన్నా, వి.సూరమ్మ, డి.సాయికుమారి, వి.లక్ష్మి, ఎస్.చింతాలు, టి.భారతి, డి.ప్రసన్నకుమారి, మంగమ్మ, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

తణుకు: తణుకు నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులతో స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ గురువారం సమీక్ష నిర్వహించారు. తొలుత నీటిపారుదల శాఖ అధికారులతోపాటు కాంట్రాక్టర్లతో సమావేశమైన ఎమ్మెల్యే రాధాకృష్ణ నియోజకవర్గంలో రైతులకు సాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలత్తెనీయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష చేసిన ఆయన రోడ్లు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష చేసిన ఎమ్మెల్యే నియోజకవర్గంలోని ఇళ్లు లేని వారిని గుర్తించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరు చేయాలన్నారు.